సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



రూ.1,11,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఎస్‌కేజీ కృష్ణంరాజు దంపతులు (భీమవరం) రూ.1,11,116 శుక్రవారం విరాళం సమర్పించారు.



వెండి కంచం సమర్పణ

గోకవరం: స్థానిక గ్రామ దేవత గంగాలమ్మ వారికి హంసపరుగుల రంగమ్మ (గోకవరం ఇందిరమ్మ మోడల్ కాలనీ) శుక్రవారం రూ.1.05 లక్షల విలువైన వెండి కంచం సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సెహరీ ఆది (ఉ॥)
రాజమహేంద్రవరం	6.26	4.30
కాకినాడ	6.25	4.31
అమలాపురం	6.25	4.31

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీతోనే విద్యార్థుల భవిత

ఎన్నికల ప్రచారంలో మంత్రి **విశ్వరూప్**



ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో విద్యార్థుల ఉన్నత స్థాయి చదువులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గొప్ప తోడ్పాటు అందిస్తోందని రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో ఎస్.పల్లిపాలెం, సామంతకుర్రు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఎస్.పల్లిపాలెం మత్స్యకార గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా మీ ఇంటికి చేరాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మనమే ఎన్నుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విశ్వరూప్ అన్నారు. అనంతరం సామంతకుర్రు, గాంధీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం జగన్ అయితేనే ఈ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, లబ్ధిదారులకు నేరుగా సంక్షేమం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు కొల్లు వెంకటరమణ, సుందరనీడి సాయి, ఎంపీటీసీ కర్రి సత్య, గ్రామ కమిటీ అధ్యక్షులు కర్రి శ్రీను, మండల పార్టీ ఉపాధ్యక్షులు చెద్దళ్ల వాసుదేవుడు, మత్స్యకార సొసైటీ చైర్మన్ కేవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయ్ వెయిట్ లిఫ్టింగ్ శిక్షణకు శశికళ



అమలాపురం టౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ సెంటర్‌కు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి యు.శశికళ ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు ఆ సెంటర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెలలో శాయ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ హాస్టల్ కోచింగ్‌కి జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో ఆమె పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిందని వెంకటేశ్వరరావు వివరించారు. ఈ మేరకు శశికళను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ, కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, పీఈటీలు మట్టపర్తి వెంకట సముద్రం, వి.బుజ్జి, కోచ్ డాక్టర్ వెంకటేశ్వరరావు, జిమ్ క్రీడాకారులు అభినందించారు.

వైభవంగా అధ్యయనోత్సవాలు



అధ్యయనోత్సవాల్లో పాల్గొన్న వేదపండితులు, ఆలయ అర్చకులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అళ్వారుల వద్ద వేద పండితులు వేద పఠనం చేశారు. బాలభోగం, నివేదన, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 18 నుంచి వారం రోజుల పాటు జరగనున్న కల్యాణోత్సవాల్లో ఈ అధ్యయనోత్సవాలు నిర్వహించడం అనవాయితీ అని దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్ కుమార్ వివరించారు.

సత్యదేవుని దర్శించిన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

అన్నవరం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఏఈఓ కృష్ణారావు బహూకరించారు. ఆమె పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామిని కూడా దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

నేనున్నా నేస్తం

- వివిధ పథకాలతో ప్రభుత్వం అభయం
- ఆర్థికంగా వెనులుబాటు కలిగిందని గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ కాపు నేస్తం... వైఎస్సార్ ఈబీసీ నేస్తం... వైఎస్సార్ నేతన్న నేస్తం... వైఎస్సార్ లా నేస్తం... ఇలా నేనున్నానంటూ 'నేస్తం'గా నిలచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు వేలాది రూపాయిల ప్రయోజనం అందించింది. ఈ పథకాల ద్వారా వివిధ వర్గాలకు చెందిన మహిళలతో పాటు జూనియర్ లాయర్లకు మేలు చేసింది. ఇంటి వద్ద కుట్లు, అల్లికలు వంటి పనులు చేసుకునేవారు. పలు వ్యాపారాలు చేసుకునే మహిళలతో పాటు చీరలు, ఇతర వస్త్రాలు నేసుకునే మహిళలు, పురుషులకు ఈ సొమ్ములు పెట్టుబడులుగా కలిసి వచ్చాయి. వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న నేస్తం పథకాలు.. వాటి వల్ల జిల్లాలో కలిగిన లబ్ధి ఇలా..



కలెక్టరేట్‌లో ఈబీసీ నేస్తం చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)

పథకం	లబ్ధిదారులు	పొందిన లబ్ధి (కోట్లలో)
వైఎస్సార్ కాపు నేస్తం	34,962	165.609
వైఎస్సార్ నేతన్న నేస్తం	17,811	43.33
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	22,253	34.15

ఈబీసీ నేస్తం

అగ్రవర్ణ పేదల్లో 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15 వేల చొప్పున నేరుగా వారి ఖాతాలలో ప్రభుత్వం సొమ్ములు జమ చేస్తోంది. ఐదేళ్ల కాలంలో సుమారు రూ.75 వేలు చొప్పున వారికి ఇచ్చారు. ఈ సొమ్ములు వల్ల లబ్ధిదారుల కుటుంబాలలో ఆర్థిక సమస్యలు పరిష్కారానికి, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఎంతగానో మేలు జరిగింది. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో సుమారు 22,253 మంది లబ్ధిదారులకు రూ.34.15 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

ఏటా సొమ్ములు వచ్చాయి



ఏటా క్రమం తప్పకుండా ఈబీసీ నేస్తం సొమ్ములు వచ్చాయి. ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లపాటు రూ.75 వేల వరకు వచ్చింది. ఇంటిలో ఆర్థిక అవసరాలకు ఈ సొమ్ములు ఉపయోగపడ్డాయి. బయట అప్పులు చేయాల్సిన అవసరం చాలా వరకు తగ్గింది.

– కె.వరలక్ష్మి, మూలస్థానం అగ్రహారం, ఆలమూరు మండలం

కాపు నేస్తం

ఆర్థికంగా వెనుకబడిన కాపు కుటుంబాలకు మేలు చేసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని అమలు చేసింది. దీనిలో భాగంగా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు వారి ఖాతాలో జమ చేసింది. ఈ పథకంలో జిల్లా వ్యాప్తంగా 34,962 మంది మహిళలకు రూ.165.609 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

ఆ డబ్బులతో క్యాన్సర్ మందులు



మాది చాలా నిరుపేద కుటుంబం. జీవనానికి ఎన్నో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇటువంటి పరిస్థితులలో కాపు నేస్తం పథకం పేరుతో ఏడాదికి రూ.15 వేల చొప్పున వేస్తున్నారు. నాకు క్యాన్సర్ వచ్చింది. మందులతో పాటు నేను బతకడానికి ఈ సొమ్ములు ఉపయోగపడుతున్నాయి. ఆ జగన్ బాబుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

– పంచాది నాగమణి, కాపునేస్తం లబ్ధిదారు, కొత్తపేట

వైఎస్సార్ లా నేస్తం

న్యాయవాది పట్టా పొందిన తరువాత ఆ వృత్తిలో కుదురుకోవడం అంత సులువైన విషయం కాదు. జూనియర్ లాయర్‌గా ఆర్థికంగా రాబడి తక్కువ. ఇటువంటి వారికి ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని తీసుకు వచ్చింది. ఒక్కొక్కరికీ నెలకు రూ.ఐదు వేల చొప్పున ఏడాదికి రూ.60 వేల సాయం అందింది. వారికి మూడేళ్ల పాటు ఆర్థికసాయం అందింది.

గతంలో ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు



గతంలో ఏ ప్రభుత్వం కూడా మా జూనియర్ లాయర్లకు ఆర్థికంగా సాయం అందించలేదు. జగన్ ప్రభుత్వంలో మాకు ఆర్థిక సాయం అందించారు. ఈ సొమ్ములు తమకు ఎంతో ప్రయోజనం కలిగించాయి.

– ఆర్.శ్రీనివాసరావు, అమలాపురం



వైఎస్సార్ నేతన్న నేస్తం

మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏటా రూ.24 **వేల చొప్పున** వైఎస్సార్ సీపీ నేతన్న నేస్తం **సొమ్ములు** అందించారు. గత ఐదేళ్లలో రూ.1.20 లక్షల చొప్పున కార్మికులందరికీ ఐదు విడతలుగా సొమ్ములు వారి ఖాతాలలో జమ చేశారు. ఈ సొమ్ములతో నేత కార్మికులు తమకు కావాల్సిన ముడిసరుకు, రంగులు వంటివి కొనుగోలు చేసుకున్నారు. దీని వల్ల బయట అప్పులు చేయాల్సి అవసరం లేకుండా పోయింది. జిల్లాలో ఐదేళ్లలో 17,811 మందికి రూ.43.33 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

రూ.1.2 లక్షలు ఇచ్చారు



మా చేనేత కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఐదు ఏళ్ల నేతన్న నేస్తం ద్వారా రూ.1.2 లక్షల సహాయం అందించారు. ఈ సొమ్ములతో బట్టలు నేసేందుకు నూలు రసాయాలు, మూడుసార్లు కొనుక్కుని నేతకు పెట్టుబడిగా పెట్టుకున్నాం. చేయూత, డ్వాక్రా రుణ మాఫీ, మా భర్తకు వృద్ధాప్య పెన్షన్ కూడా వస్తున్నాయి. మా కుటుంబానికి జగన్ పలు విధాలుగా మేలు చేశారు.

– లక్కింశెట్టి బంగారమ్మ, చేనేత కార్మికురాలు, బందారులంక, అమలాపురం మండలం



అక్రమ రవాణాపై దాడులు

- రూ.4.07 లక్షల నగదు.. 389 మద్యం సీసాల సీజ్

అమలాపురం టౌన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, జిల్లా పోలీసు శాఖ ఆకస్మికంగా నిర్వహిస్తున్న తనిఖీలు, దాడులతో మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాయి. గురు, శుక్రవారాల్లో జిల్లాలో పలు చోట్ల నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డ నగదు, మద్యం వివరాలను ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఏఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) జిల్లా ఇన్‌చార్జి ఎస్.ఖాదర్ బాషా పర్యవేక్షణలో ఈ దాడులు జరిగాయి. ఈ దాడులు, తనిఖీల్లో మొత్తం రూ.4,07,350 నగదు, 389 ఎన్‌డీపీ మద్యం సీసాలు, సారా, ఐఎంఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరాలపై కూడా దాడులు చేశారు. జొన్నాడ చెక్ పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), జిల్లా పోలీసు బృందం సంయుక్తంగా గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1,98,500 నగదు సీజ్ చేశారు. ఆలమూరు, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు, రామచంద్రపురం మండలాల్లో ఎస్ఈబీ గురువారం నిర్వహించిన దాడుల్లో నమోదు చేసిన 7 కేసులకు సంబంధించి 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 365 ఎన్‌డీపీ మద్యం సీసాలు, 67.5 లీటర్ల ఐఎంఎల్, 24 ఎన్‌డీపీ సీసాలు, 16.29 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కొత్తపేట సబ్ డివిజన్‌లోని ఆలమూరు, పి.గన్నవరం పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం రెండు పేకాట శిబిరాలపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.13,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. పి.గన్నవరం పరిధిలో పొదలాడ కెనాల్ రోడ్డులో ఎఫ్ఎస్‌టీ, జిల్లా పోలీసులు శుక్రవారం తనిఖీలు చేసి రూ.1.95 లక్షలు సీజ్ చేశారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపు పేట చెక్ పోస్టుల్లో శుక్రవారం పలు వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ విష్ణు స్వరూప్ చేపట్టారు. ఎదుర్లంక వద్ద గల అంతర్రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద కూడా పోలీసులు మద్యం అక్రమ రవాణాపై తనిఖీలు చేపట్టారు.

కొరవడిన సమన్వయం

- ఉమ్మడి సమావేశానికి ముఖం చాటేసిన కూటమి నేతలు
- స్వపక్ష అభ్యర్థులూ గైర్హాజరు

సాక్షి, అమలాపురం: 'పార్టీ అధిష్టానాలు పొత్తు పెట్టుకున్నంత సులువు కాదు.. క్యాడర్ సమన్వయంతో పని చేయడం.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మేమంతా బాధితులం.. ఇప్పుడు వారి పల్లకీ మోయమంటే మనసు రావాలి కదా! గ్రామాల్లో తలెత్తుకోలేకపోతున్నాం..' ఇదీ సగటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల మనోవేదన. అందుకే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉమ్మడిగా ప్రచారమన్నా.. కలసి పనిచేసేందుకు నిర్వహిస్తున్న సమావేశాలకైనా టీడీపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట జనసేన, బీజేపీ నాయకులు, జనసేన పోటీ చేస్తున్న చోట టీడీపీ నాయకులు అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు, ఆయా పార్టీల ఇన్‌చార్జిలు, కీలక నేతలతో పట్టణంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దీనికి టీడీపీ ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్, మండపేట, రామచంద్రపురం, అమలాపురం అభ్యర్థులు వేగుళ్ల జోగేశ్వరరావు, వాసంశెట్టి సుభాష్, అయితాబత్తుల ఆనందరావు వచ్చారు. టీడీపీ కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు, ముమ్మిడివరం అభ్యర్థి దాట్ల సుబ్బరాజు డుమ్మా కొట్టారు. పి.గన్నవరం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, రాజోలు అభ్యర్థి దేవ వరప్రసాద్ సైతం ముఖం చాటేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతలక్ష్మి, శాసన మండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మాత్రమే హాజరయ్యారు. టికెట్టు ఆశించి భంగపడిన జనసేన ఇన్‌చార్జిలు ఈ సమావేశానికి దూరంగా ఉండడం విశేషం.

జిల్లాలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రచారం, ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థులకు ఇతర పార్టీల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించేందుకు ఈ కీలక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి ఏకంగా నలుగురు అభ్యర్థులు డుమ్మా కొట్టడం విశేషం. పైగా అమలాపురం టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆ పార్టీ వారికి మాత్రమే పెద్ద పీట వేశారు. జనసేన, బీజేపీలో కీలక నాయకులకు కనీస సమాచారం కూడా లేకపోవడం వంటి కారణాలు కూడా వారు ముఖం చాటేయడానికి కారణమని తెలుస్తోంది. విపక్ష కూటమి పార్టీలు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన తొలి సమన్వయ సమావేశానికి అభ్యర్థులే డుమ్మా కొట్టడంతో ఆయా పార్టీల క్యాడర్ నీరుగారిపోతోంది.

బడుగుల పెన్నిధి బాబూ జగ్జీవన్‌రామ్



కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నూపుర్ అజయ్ తదితర అధికారులు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే మరో వైపు సామాజిక సమానత్వం కోసం అలుపెరగని సమరం సాగించిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆ మహనీయుడి 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల పెన్నిధి, సమతావాది, పరిపాలనాదక్షుడు, స్వాభిమానానికి, కార్యదీక్షకు పోరాటపటిమకు సంస్కర్తగా జగ్జీవన్‌రామ్ ప్రతీకగా నిలిచారని అన్నారు. గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ సామాజిక విప్లవ యోధుడని ఆయనను కొనియాడారు. భారత ఉపప్రధానిగా వ్యవహరించారన్నారు. సుదీర్ఘకాలం పాటు పార్లమెంట్ సభ్యుడిగా, క్యాబినెట్ మంత్రిగా ప్రపంచ రికార్డు సాధించారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ మాట్లాడుతూ ఆయన 1973లో భారత్–పాకిస్తాన్ యుద్ధంలో భారత రక్షణ మంత్రిగా పనిచేశారని, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో జగ్జీవన్ రామ్ ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్లు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు జనుపల్లి, కొంకాపల్లి సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..



బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా తదితరులు

అమలాపురం టౌన్: దేశానికి ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీలు, సీఐలు ఆ మహనీయుని చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా దిశ డీఎస్పీ వై.గోవిందరావు, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, స్పెషల్ బ్రాంచి సీఐలు వి.శ్రీనివాస్, బి.రాజశేఖర్, సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావుతో పాటు ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మూల్యాంకనం

- తొలిసారిగా స్పాట్‌లోనే మార్కుల పోస్టింగ్
- జిల్లాకు వచ్చిన 1.33 లక్షల జవాబు పత్రాలు
- ఇక అందరి దృష్టి ఫలితాలు పైనే
- ఈ నెల 12న వెలువడే అవకాశం



అమలాపురంలోని జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం

రాయవరం: ఇంటర్మీడియెట్ బోర్డు ఆధ్వర్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం అత్యంత వేగంగా నిర్వహించారు. గతేడాది వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం రాజమహేంద్రవరంలో నిర్వహించగా, జిల్లాల పునర్విభజన అనంతరం ఈ ఏడాది తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నిర్వహించారు. ఈ ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం అదే 'స్పాట్' కేంద్రంలో మార్కులను నమోదు చేయడం కొత్త విషయంగా చెప్పవచ్చు. మార్చి 9న సంస్కృతం పరీక్షతో ప్రారంభమైన మూల్యాంకనం శుక్రవారం రసాయన శాస్త్రం జవాబు పత్రాల వేల్యుయేషన్‌తో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇంటర్ మొదటి, రెండు సంవత్సరాలకు చెందిన జవాబు పత్రాలను 28 రోజుల పాటు దిద్దారు.

1.33 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనం

ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రానికి వివిధ జిల్లాల నుంచి చేరుకున్న 1,33,865 జవాబు పత్రాలను వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులు దిద్దారు. ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి వి.సోమశేఖరరావు నేతృత్వంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఇంటర్ ఫస్టియర్ అన్ని సబ్జెక్టులు కలిపి 73,750, సెకండియర్ 60,115 ఆన్సర్ స్క్రిప్ట్‌ను వేల్యుయేషన్ చేశారు. ఫస్టియర్‌కు సంబంధించి ఇంగ్లీషు 12,624, తెలుగు 4,436, హిందీ 308, సంస్కృతం 6,343, గణితం–1ఎ 9,700, గణితం –1బి 8,161, జీవశాస్త్రం 2,782, జంతుశాస్త్రం 2,605, భౌతికశాస్త్రం 8,861, రసాయన శాస్త్రం 9,110, అర్థశాస్త్రం 3,174, వాణిజ్యశాస్త్రం 2,200, చరిత్ర 533, పౌరశాస్త్రం 2,913 జవాబు పత్రాలను జిల్లాలో మూల్యాంకనం చేశారు. అదే విధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు 10,344, తెలుగు 3,587, హిందీ 261, సంస్కృతం 5,374, గణితం –2ఎ 6,898, గణితం–2బి 6,470, జీవశాస్త్రం 2,363, జంతుశాస్త్రం 2,210, భౌతికశాస్త్రం 8,526, రసాయన శాస్త్రం 7,755, అర్థశాస్త్రం 2,307, వాణిజ్యశాస్త్రం 1,574, చరిత్ర 402, పౌరశాస్త్రం 2,044 జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. ఈ ప్రక్రియలో 430 మంది అసిస్టెంటు ఎగ్జామినర్లు పేపర్లను మూల్యాంకనం చేశారు. మూల్యాంకనం చేసిన పేపర్లను 82 మంది పరిశీలకులు తనిఖీ చేశారు. అలాగే మూల్యాంకన ప్రక్రియలో 82 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 13 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, జెన్ 1, జెన్ 2, ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. స్కానర్ ఇన్‌చార్జి, కో ఆర్డినేటర్లు మార్కులను పోస్ట్ చేశారు.

స్పాట్‌లోనే మార్కులు..

సాధారణంగా ఇప్పటి వరకు మూల్యాంకనం అనంతరం ఓఎంఆర్ షీట్‌లోని పార్ట్–3(మార్కులు నమోదు చేసిన షీట్)ను విడదీసి బండిల్స్‌గా ఇంటర్మీడియేట్ బోర్డుకు పంపించేవారు. అక్కడ బోర్డు అధికారుల పర్యవేక్షణలో ఓఎంఆర్ షీట్ పార్ట్–3లో మార్కులను స్కానర్ ద్వారా స్కాన్ చేసి, మార్కుల నమోదు అనంతరం ఫలితాలను ప్రకటించేవారు. ఈ ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని తగ్గించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ఈ ఏడాది తొలిసారిగా ప్రతి స్పాట్ కేంద్రానికి స్కానర్‌ను అందజేశారు. విద్యార్థికి నష్టం లేకుండా స్కానింగ్ అనంతరం మరొకసారి మార్కుల నమోదును నిర్ధారించడం వల్ల విద్యార్థికి నష్టం కలగదు. స్కానర్ ద్వారా స్పాట్ కేంద్రంలో మూల్యాంకనం చేసిన అనంతరం మార్కులు నమోదు చేశారు. ఈ నెల 12న ఫలితాలు వచ్చే అవకాశముంది.

పారదర్శకంగా, వేగంగా..



అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి పారదర్శకంగా, అత్యంత వేగంగా నిర్వహించినట్టు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గత నెల 9వ తేదీ నుంచి మొదలైన ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారంతో ముగిసింది. ఐదు విడతలుగా వచ్చిన 1,33,865 జవాబు పత్రాలను 609 మంది మూల్యాంకనం చేసినట్టు క్యాంపు ఇన్‌చార్జి, డీఐఈవో సోమశేఖరరావు శుక్రవారం స్థానిక మీడియాకు వివరించారు. 430 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు జవాబు పత్రాలు దిద్దితే ఆ పత్రాలను 82 మంది స్క్రూటీనైజర్లు పరిశీలించారన్నారు. వీరితో పాటు 82 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 13 మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, జోన్–1, జోన్–2 లకు ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు ఇలా మొత్తం 609 మంది మూల్యాంకనంలో భాగస్వాములయ్యారన్నారు. రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రకటించిన గడువులో మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సోమశేఖరరావు వివరించారు. అధికారుల అంచనాల ప్రకారం ఈ నెల రెండో వారంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మూడు జిల్లాలుగా విభజన జరిగాక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇంటర్మీడియెట్ మూల్యాంకనం నిర్వహించడం ఇదే మొదటిసారని చెప్పారు. మూల్యాంకనంలో పాల్గొన్న సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

7న ఆర్చరీ పోటీలు

పిఠాపురం: ఈ నెల 7వ తేదీ శనివారం పిఠాపురం ఆర్ఆర్బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఆర్చరీ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిలా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జీఎస్ఎస్ గోపాలకృష్ణ, లక్ష్మణరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇండియన్ రౌండ్ బౌ విభాగంలో అన్ని వయసుల కేటగిరీల్లో జిల్లా స్థాయి ఆర్చరీ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మెన్, విమెన్‌లకు నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, తీసుకురావాలని వారు తెలిపారు. ఇండియన్ రౌండ్, రీకర్వ్ కాంపౌండ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. వివరాలకు 99890 01162 నంబరును సంప్రదించాలని వారు సూచించారు.

పెళ్లి కార్డులో ఎన్నికల ప్రచారంపై ఫిర్యాదు

పిఠాపురం: కొత్తపల్లి మండలం కొండెవరంలో ఒక పెళ్లి కార్డులో జనసేన పార్టీ తరపున ఎన్నికల ప్రచారం చేయడంపై శుక్రవారం జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నేత మల్లికార్జునరావు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా పెళ్లి కార్డులో జనసేన తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పిఠాపురం రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని విచారణ జరపాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలపై వారు కొండెవరం చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను ఆర్ఓకు అందజేస్తామని తదుపరి చర్యలు వారు తీసుకుంటారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వరప్రసాద్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు నక్కా శ్రీరామ్

ముమ్మిడివరం: మోటారు సైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తి గాయాలపాలయ్యాడు. అంబాజీ పేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నక్కా శ్రీరామ్ (32) అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన నక్కా శ్రీనివాస్ అపోలో ఫార్మసీలో పనిచేస్తున్నారు. శుక్రవారం కాకినాడలో ఫార్మసీ కంపెనీలో జరిగిన సమావేశానికి హాజరై మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా ముమ్మిడివరం శివారు బొంచాయికోడు వద్ద 216 జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నక్కా శ్రీరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హతే ప్రామాణికం

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఎన్నికల కమిషన్ నిర్దేశం
- సువిధలో దాఖలే చెల్లుబాటు
- అభ్యర్థి వెంట ఐదుగురికి మాత్రమే ఆర్వో చాంబర్‌లోకి అనుమతి



కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఘట్టం ఈనెల 18న విడుదల అవుతుంది. అదే రోజు నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఇందులో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసేవారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింది. అలాగే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

అర్హతలు ఇవే

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా భారత దేశ పౌరుడు అయి ఉండాలి. నామినేషన్ దాఖలు చేసే రోజుకు 25 సంవత్సరాలు పూర్తయి ఉండాలి.
- రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులైతే నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- ఎంపీగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 ధరావతు చెల్లించాలి.
- ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావతు చెల్లించాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటలకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించి లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- ఫారం-2 బిలో నామినేషన్ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను చూపించాలి. అదే విధంగా కేసుల వివరాలను, క్రైం నెంబర్‌తో సహా పొందుపరచాలి.
- అఫిడవిట్‌లోని అన్ని ఖాళీలను తప్పనిసరిగా పూరించి సమగ్ర వివరాలను నమోదు చేయాలి.

అఫిడవిట్ అందరికీ అందుబాటులో ఉంచాలి

- అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌ను అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. నకలును ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.
- రోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు.
- నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ, నోటీసు బోర్డులోనూ ప్రజల పరిశీలనకు ఉంచుతారు.
- నామినేషన్ దాఖలు పారదర్శకంగా ఉండేందుకు నామినేషన్ ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లుగా ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తోపాటు దాఖలు చేయాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీ బిల్లు బకాయిలు లేనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

నామినేషన్ దాఖలు చేసేటప్పుడు..

- నామినేషన్‌ను సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో చాంబర్‌లోకి అభ్యర్థితో పాటు ఐదుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు.
- అభ్యర్థులు తమ బి-ఫారమ్, ఎ-ఫారమ్ ఒరిజినల్ అందించాలి. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు.
- అభ్యర్థులు రెండు (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్ట్ సైజ్) ఫొటోలను నామినేషన్‌తో పాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి.
- ఓ అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల (జతల) నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి. ప్రతిజ్ఞ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదే విధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరును ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- అభ్యర్థి చెల్లించిన ధరావతుకు సంబంధించి రసీదుతో పాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్ణీత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చుల లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు తమ సందేహాలను ఇక్కడ నివృత్తి చేసుకోవచ్చు.
- అన్ని పత్రాలను సువిధ అప్లికేషన్ (యాప్) ద్వారానే అందజేయాలి. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తారు.

చింతలు తీర్చే నూకాలమ్మ తల్లి

- రేపటి నుంచి జాతర
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి
- అమ్మవారిని దర్శించనున్న లక్షలాది భక్తులు


చింతలూరులో వేంచేసియున్న శ్రీనూకాంబిక అమ్మవారు


చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారి జాతరలో గరగ నృత్యాలు

ఆలమూరు: భక్తుల పాలిట కల్పవల్లిగా చింతలూరి వంశస్తుల ఆడపడుచు నూకాంబిక అమ్మవారు ప్రసిద్ధి గాంచింది. యేటా ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రాత్రి నుంచి జాతర, తీర్థ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. కోస్తా జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది. పవిత్ర గౌతమీ గోదావరి తీరాన ఉన్న ఆలమూరు మండలం చింతలూరులో కొలువైన అమ్మవారికి రెండున్నర శతాబ్దాల చరిత్ర ఉంది. చింతలూరు గ్రామ శివారులో పాలచెట్టు తొర్రలో లభించిన అమ్మవారి విగ్రహాన్ని అప్పటి పిఠాపురం మహారాజు సహకారంతో ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. చంటిపిల్లల పాలిట అమృతవల్లిగా, సకల పాపాలు హరించే మాతృమూర్తిగా అమ్మవారు పేరొందారు. అమ్మవారికి చిన్నారులతో కాగడాలు వెలిగించి వారకల్లు, తుళ్లబిళ్ల దిష్టి తీయిస్తే తట్టు, పొంగు, ఆటలమ్మ వంటి అంటు వ్యాధులు పోతాయని భక్తుల విశ్వాసం. అమ్మవారిని నెలరోజుల ముందు నుంచే మండలంలోని అన్ని గ్రామాల్లో బుట్టగరగ రూపంలో ఇప్పటికే ప్రజలకు దర్శనమిచ్చింది.

మోదుగపూల గరగ ప్రత్యేక ఆకర్షణ

అమ్మవారి పూల (గరగ) ఘటానికి పక్షం రోజుల ముందునుంచే కొత్త, పాత పూల ఉత్సవాలను నిర్వహిస్తారు. అయితే ఈ పూలను రోజు విడిచి రోజు మన్య సీమ నుంచి తీసుకువచ్చిన మోదుగపూలతో అలంకరిస్తారు. ఈగరగను నెత్తిన ధరించిన నృత్య కళాకారుడిచే చంటిపిల్లలను దాటిస్తే ఏ రోగాలు దరిచేరవని భక్తులు విశ్వసిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీనూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామ పరిసరాల్లో చలువ పందిళ్లు, విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు. ఆర్‌డీఓ, ఉత్సవ కమిటీ ప్రత్యేక అధికారి జీవీవీ సత్యనారాయణ జాతర, తీర్థోత్సవాలపై ఇప్పటికే రెండుసార్లు సమీక్షించి అధికారులను అప్రమత్తం చేశారు. రామచంద్రపురం, రావులపాలెం, రాజమహేంద్రవరం డిపోల నుంచి ఆర్‌టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.


మోదుగుపూలతో అలంకరించిన పెద్ద పూల గరగ

ఈ నెల ఏడున జరిగే అమ్మవారి జాతర రోజున అబ్బురపరిచే గరగ నత్యాలు, ఎనిమిదిన జరిగే తీర్థం రోజున గవ్వ నృత్యం, తొమ్మిదో రోజైన ఉగాది నాడు నిర్వహించే 'బద్ది కడుగుట' ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు జరగకుండా డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్ పర్యవేక్షణలో పోలీసుల బృందం బందోబస్తు ఏర్పాట్లు చేస్తుంది.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. క్యూలైన్లు, తాగు నీటి వసతి, చంటి పిల్లలకు పాల సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

– నూకపెయ్యి సూరిబాబు, ఆలయ కమిటీ చైర్మన్, చింతలూరు

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం



అమ్మవారి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. దేవదాయశాఖ ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకతతో ఉత్సవాలు చేపట్టనున్నాం. ఇప్పటికే ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాం.

– ఎంఎస్ఆర్ కృష్ణ, ఈఓ, చింతలూరు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in April/May Cont: ✆ : 73383 76874 [R-418]

Real Estate

FLAT FOR SALE

■ నిడదవోలు, గాంధీనగర్, లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సీ నందు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్స్ ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ E/F అమ్మకమునకు కలవు. నో బ్రోకర్స్ Contact : ✆ : 94410 37735 [R-6644]

HOUSE FOR SALE

■ G+2 House For Sale, A.V.A. Road, Rajahmundry ✆ : +91 93984 67658, +91 63009 02435 [R-6460]

SITE FOR SALE

■ మోరంపూడి-నామవరం(రాజమండ్రి) మెయిన్‌రోడ్‌ని ఆనుకుని 2800 చ॥గ॥ రెసిడెన్షియల్ / వాణిజ్య భవన నిర్మాణాలకు అనువైన స్థలం అమ్మకమునకు కలదు. ఫోన్ : 93464 50602, 91107 42666 [V- 2468]

PLOT FOR SALE

■ తూర్పు గోదావరి జిల్లా, రాజానగరంలో R.S. వెంచర్స్ వారి ఉడా అప్రూవల్ L.P.No. RJD/34/2014 లో 316 చ.గ.ల పడమర, ఉత్తరం కార్నర్ ప్లాట్ అమ్మబడును. సంప్ర: 98481 84569 [G-04]

TO-LET COMMERCIAL

■ తుని, డి-మార్ట్ దగ్గరలో నజరత్ ఎడ్యుకేషనల్ సొసైటీ 48,000 Sft. బిల్డింగ్స్ అద్దెకు ఇవ్వబడును. కమర్షియల్ పర్పస్, స్కూల్స్‌కి, హాస్పిటల్స్‌కి, ఆఫీసులకు గ్రౌండ్, పార్కింగ్ సౌకర్యం కలదు. ✆ : 83413 30911, 94921 40329 [-1151722]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ సామర్లకోట, కాకినాడలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గంటల డ్యూటీ, జీతం: రూ.11,000/- వయస్సు 50 సం॥లలోపు రాయడం వచ్చి ఉండాలి. ✆ : 96522 44848, 88857 68111 [R-07]

■ రాజమండ్రి Gopal Automobiles నందు Car Wash చేయుటకు స్త్రీలు కావలెను. జీతం : 10,000/- & Car Machanics, Helpers మరియు Drivers కావలెను. ✆ : 99082 71555 [R-1184345]

■ హైదరాబాదులోని తుక్కుగూడలో ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు భార్య భర్త కావలెను. వ్యవసాయం తెలిసి ఉండాలి. మంచి జీతం రూము ఇస్తారు. Contact no. ✆ : 83096 63070 [R-6499]

■ రాజమండ్రి+తణుకు, ప్ర॥ కం॥ ATM's స్టార్ హోటల్స్, షోరూమ్స్‌నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్ వైజర్స్ కావలెను. జీ॥ 12-15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY. ✆ : 93922 69369 [R-424]

■ ఉద్యోగాలు: 10th to డిగ్రీ చదివి పై చదువులు చదివే స్తోమత లేని నిరుద్యోగులకు కంపెనీలో ఉద్యోగాలు. Age: 28 సం॥లోపు ఉచిత శిక్షణలో నెలకు 9000 నుండి 12000, రూం ఫ్రీ. సంప్ర॥ VJA Ph: 9949554873. [WA-7508]

■ కష్టపడేవ్వాళ్ళు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీరూమ్ +భోజనం. Hyd. Ph: 7995365999 [HA-01]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185017]

■ వాటర్‌వాష్ హెల్పర్లు, మెకానికల్ హెల్పర్లు కావలెను. అనుభవం బట్టి జీతం : రూ.12,000/- నుండి రూ.20,000/- వరకు. Cont: శ్రీదేవి హోండా, అథరైజ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ : 94909 98888. [R-04]

■ Wanted Male Marketing Vice Principals, Course Incharges and Female Hostel Incharges, Qualification any Degree, Age Limit: 25 to 45 years, Salary: 10000/- to 20000/-. Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370 [G-5227]

■ APSRTC నందు కాకినాడ, రాజమండ్రి, రాజోలు మరియు నరసాపురం డిపోల యందు పనిచేయుటకు AC Bus Attendents (Boys), HSD Oil Topup కావలెను. వయస్సు : 19 నుండి 50 సం॥లు. ఆకర్షణీయమైన జీతం మరియు PF, ESI కలదు. ✆ : 94937 85599, 81216 96346, 93812 13234 [R-06]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎఫ్ఎస్‌టీ తనిఖీల్లో రూ.1.48 లక్షల నగదు స్వాధీనం


పెద్దాపురంలో ఎఫ్ఎస్‌టి స్వాధీనం చేసుకున్న నగదుతో ఎన్నికల సిబ్బంది

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహించే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టి) శుక్రవారం పెద్దాపురం-రాజమహేంద్రవరం రోడ్డులోని గుర్రాల సెంటర్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ 1.48 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ వెంకటరాజు గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో బైక్‌లో అనధికారికంగా ఉన్న ఈ నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆధారాలు చూపించకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని ట్రెజరీకి అందజేయనున్నట్టు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

రూ.4.5 లక్షల ఆస్తి నష్టం


మంటల్లో కాలిపోతున్న తాటాకిల్లు

కోటనందూరు: మండలంలోని కేఏస్ కొత్తూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం తాటాకిల్లు దగ్ధమైంది. అధికారుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొరుప్రోలు జగదాంబ ఓ తాటాకింట్లో పిల్లలు, అత్త గారితో కలిసి నివాసముంటోంది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నిప్పంటుకుంది. ఈ అగ్ని ప్రమాదంలో తులంన్నర బంగారం, వెండి వస్తువులు, రూ.30 వేల నగదుతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు, బట్టలు కాలిబూడిదయ్యాయి. వీఆర్వో లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు కాలిపోయిన ఇంటిని పరిశీలించి రూ.4.5 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వ సహాయానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

రౌతులపూడి: శంఖవరం మండలం ఎస్.జగ్గంపేటకు చెందిన యువతి రౌతులపూడి మండలం బలరామపురంలో తన తాతగారి ఇంటి దగ్గర ఉంటున్నది. ఆమె అదృశ్యమైందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండల దారా కిరణ్ అనే వ్యక్తి బలరాముపురంలో తన తాతగారి ఇంటివద్ద ఉంటున్న ఆమెను అపహరించినట్లుగా కుటంబ సభ్యులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

రౌతులపూడి: మండలంలోని ములగపూడికి చెందిన తన భర్త కాపారపు వసుంబాబు (వినోద్) కొంతకాలంగా వేధిస్తున్నాడని అతని భార్య ఫిర్యాదు చేసినట్టు ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. అదనపు కట్నం తేవాలంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

తాడేపల్లిగూడెం శశిలో 7న అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శశి క్యాంపస్‌లో ఏప్రిల్ 7వ తేదీన ఆదివారం 6వ తరగతి నుంచి 10+1 విద్యార్థుల కోసం ఐఐటీ జేఈఈ, నీట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. క్యాంపస్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన హాస్టల్ క్యాంపస్ ప్రారంభిస్తున్నామని విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మేకా క్రాంతి సుధ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నేత మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు

కాజులూరు: మండలంలోని దూడలగరువుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, చేదువాడ, తిప్పరాజుపాలెం మాజీ ఎంపీటీసీ ముదుకు నాగేశ్వరరావు (63) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. సంఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం నాగేశ్వరరావు కాజులూరు వెళ్లి తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తున్నారు. తమ స్వగ్రామం దూడలగరువు వద్దకు వచ్చే సరికి అయితపూడికి వెళ్తున్న వ్యక్తి మద్యం తాగి బైక్‌పై వేగంగా వచ్చి నాగేశ్వరరావును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆయనకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి 108 అంబులెన్సులో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. నాగేశ్వర్రావుకి ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందారు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ బోస్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ పరామర్శ

నాగేశ్వరరావు మృతి వార్త తెలియగానే అంగ్రంగిలో ఇంటింటి ప్రచారంలో ఉన్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందారన్న విషయం తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

రెండు కార్లు ఢీ – ఒకరి మృతి


చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులను పరామర్శిస్తున్న డీఈఓ వరలక్ష్మి, డీవైఈఓ శ్రీదేవి

- ఐదుగురు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన డీఈఓ, డీవైఈఓ


నాగేశ్వరప్రసాద్ (ఫైల్)


చికిత్స పొందుతూ మృతి చెందిన నాగేశ్వరప్రసాద్

బెళుగుప్ప: మండల పరిధిలో జాతీయ రహదారిపై శుక్రవారం రెండు కార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో ఓ వైద్యుడు మృతి చెందారు. ఐదుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన ఆయుర్వేద విశ్రాంత వైద్యాధికారి నాగేశ్వరప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలసి రాయదుర్గానికి కారులో వెళుతుండగా బెళుగుప్ప మండలం హనిమరెడ్డి పల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారులో అనంతపురంలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఘటనలో రెండు కార్లూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్ర గాయాలతో డాక్టర్ నాగేశ్వరప్రసాద్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. నేత్రపల్లి, దురదకుంట, నరసాపురం, లక్ష్మంపల్లి, బ్రహ్మసముద్రం జెడ్పీహెచ్ఎస్‌లలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు తిప్పేస్వామి, రామశేఖర్, హరికృష్ణ, రామచంద్ర, తిప్పేస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక డాక్టర్ నాగేశ్వరప్రసాద్ మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న డీఈఓ వరలక్ష్మి, గుత్తి డివిజన్ డీవైఈఓ శ్రీదేవి ఆస్పత్రికి చేరుకుని ఉపాధ్యాయులను పరామర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.